
భలే చౌక.. జర్నీ



తక్కువ చార్జీకే గమ్యస్థానాలకు..

- అందుబాటులో పలు యాప్‌లు
- వినియోగించుకుంటున్న నగరవాసులు

Sunday SPECIAL

ఇప్పుడంతా ఉరుకులపరుగుల జీవితం. ఉదయం నిద్ర లేచింది మొదలు.. రాత్రి మళ్లీ నిద్రపోయే వరకు అంతా బిజీబిజీ. ఇక నగర వాసుల గురించైతే చెప్పే పనేలేదు. ప్రతీ క్షణమూ విలువైనదే అన్నట్టుగా వారి దైనందిన జీవితం సాగుతుంది. అలాంటి నగర వాసులు నిత్యం ఎదుర్కొనేది ప్రయాణ ప్రయాస.. ట్రాఫిక్ ఇబ్బందులు. ఈ క్రమంలోనే నగర వాసులకు ముఖ్యంగా అన్ని వర్గాల ఉద్యోగులకు సాంకేతికత బాసటగా నిలుస్తోంది. కొన్ని వాహనరైడ్ యాప్‌లు అందుబాటులోకి రాగా.. ఆ యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకుని రైడ్ బుక్ చేసుకుంటే చాలు నిమిషాల వ్యవధిలో ఉన్నచోటుకు వచ్చి తక్కువ చార్జీకే గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. దీంతో సొంత వాహనాలున్న వారు కూడా ఈ రైడ్స్ పట్ల ఆసక్తి చూపుతుండటం గమనార్హం. ప్రస్తుతం వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రైసిటీల్లో మూడు ప్రముఖ సంస్థలు యాప్‌ల ద్వారా సేవలందిస్తున్నాయి. ఈ అవకాశాన్ని వినియోగించుకుంటున్న వారు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తక్కువచార్జీకే ఉన్నచోటు నుంచి గమ్యస్థానాలకు సకాలంలో చేరుకోవడంతో పాటు ట్రాఫిక్ కష్టాల నుంచి ఉపశమనం పొందుతున్నామంటున్నారు.

- రాంనగర్



ఈ జర్నీ చాలా సౌకర్యవంతంగా ఉంది

- చిర్ర వెంకటేశ్వర్లు, ప్రభుత్వ టీచర్



ఉరుకులు పరుగుల జీవితంలో ఈ యాప్‌లు ఎంత గానో ఉపయోగపడుతున్నాయి. నేను దుగ్గొండిలో పని చేస్తా. సొంత వాహనం వాడనప్పుడు ఈ సర్వీసులపై ఆధారపడతా. ఆర్టీసీ బస్సులో వెళ్లాలంటే వరంగల్ బస్టేషన్‌కు వెళ్లాలి. నేను పెగడపల్లి డబ్బాల జంక్షన్ వద్ద ఉంటాను. స్కూల్‌కు ఆలస్యం అవుతుంద నుకుంటే ఇంటి వద్ద నుంచి ర్యాపిడో సర్వీసు లో టూ వీలర్ బుక్ చేసుకుని వెళతాను. రూ.70చార్జీతో సేఫ్‌గా వరంగల్ బస్‌స్టేషన్ చేరుకుంటా. ప్రైవేటు ఆటోలో వెళ్లాలంటే మా ఇంటి నుంచి అర కిలోమీటర్ నడిచి వెళ్లాలి. ర్యాపిడో అయితే బుక్ చేసిన క్షణాల్లో ఇంటి వద్దకు వచ్చి చేరు కుంటుంది. ఈ అవ కాశాన్ని నగరం లోని చాలా మంది సద్వి నియోగం చేసుకుం టున్నారు.

వివరాలు : 7లో..

ప్రజా ఉద్యమ కెరటం గద్దర్

తన గళంతో యావత్ ప్రజానీకాన్ని చైతన్యం చేశారు

యేడాది యాది సభలో ప్రొఫెసర్ కాశీం



పాలకుర్తిలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కాశీం

పాలకుర్తి, ఆగస్టు 24 : అణగారిన వర్గాలకు అండగా నిలిచిన ఉద్యమ కెరటం ప్రజాయుద్ధ నౌక గద్దర్ అని ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు ప్రొఫెసర్ కాశీం అన్నారు. శనివారం పాలకుర్తి రాజీవ్ చౌరస్తాలో గద్దర్‌తో పాటు ప్రజా జర్నలిస్టు జహీర్ అలీ ఖాన్ స్మృతికి నివాళిగా 'యాడాది యాది సభ' నిర్వహించారు. అమరుల స్థూపానికి నివాళ్లర్పించారు. అనంతరం గ్రామంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలకు గద్దర్ నాయకత్వం వహించాడని గుర్తు చేశారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై తన పాట, మాటలతో యావత్ ప్రజానీకాన్ని చైతన్యం చేశాడని అన్నారు. గద్దర్ సాహిత్యం, పాటలు, ఉద్యమాలు సజీవంగా ఉంటాయని అన్నారు. దేశంలో జరుగుతున్న ప్రజా ఉద్యమాలకు ఆయన దిక్సూచి లాంటి వాడన్నారు. నిజాం, నిరంకుశ పాలనపై తిరుగుబాటు చేసిన చాకలి ఐలమ్మ ఈ ప్రాంతానికి చెందిన గొప్ప యోధురాలు అని కొనియాడారు. ఈ ప్రాంతంలో అనేక మంది ప్రజలు పోరాట యోధులుగా మారారని అన్నారు. గద్దర్ చదువుకునేప్పుడు దళితులకు తప్ప అన్ని కులాల వారికి హాస్టల్స్ ఉండేవని, దీంతో తాను వివక్షకు గురయ్యాడని గుర్తు చేశారు. దేశంలో వేల మంది కళాకారులను గద్దర్‌తయారు చేశారని అన్నారు.

మూఢనమ్మకాల నిర్మూలన వ్యవస్థాపక అధ్యక్షుడు బైరి నరేష్ మాట్లాడుతూ ఇప్పుడున్న పాటలు రాళ్లలో బియ్యం ఏరుకున్నట్లు ఉన్నాయని అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా ఎల్లాపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి గద్దర్‌కు నంది అవార్డును సభా వేదికగా ప్రకటించారని, అది ఇప్పటికీ ప్రకటనగానే మిగిలిందని విమర్శించారు. గుమ్మడిరాజు సాంబయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో సీపీఐ (ఎం-ఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్‌రాజా, చక్రాల రఘు, సీనియర్ జర్నలిస్టు మార్గం లక్ష్మీనారాయణ, గూడూరు లెనిన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలి

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు సంబంధించిన స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

రఘునాథపల్లి, ఆగస్టు 24: లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్) దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులకు సూచించారు. శనివారం ఆయన నిడిగొండ, రఘునాథపల్లి పరిధిలో సర్వే నంబర్ల ఆధారంగా స్థలాల రెగ్యులరైజేషన్‌ను క్షేత్రస్థాయిలో ఎల్ఆర్ఎస్ యాప్ ద్వారా పరిశీలించారు. దరఖాస్తుల నమోదు ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల విషయంలో రెవెన్యూ, నీటిపారుదల శాఖ, టౌన్ ప్లానింగ్ అధికారులు పారదర్శకంగా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఖిలాషాపూర్ కస్తూర్బా బాలికల పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని, విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలతో కూడిన ఆహారాన్ని అందించాలని, ఎక్కువ కాలం నిల్వ చేసిన సరకులను ఉపయోగించకూడదని ఆదేశించారు. అనంతరం విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ పురం యుగేందర్, ఎంపీడీవో గార్లపాటి శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

ఎల్ఆర్ఎస్ ప్రక్రియపై హెల్ప్‌డెస్క్ ఏర్పాటు..

జనగామ రూరల్, ఆగస్టు 24: జనగామ మునిసిపల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ ప్రక్రియపై హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఆర్ఎస్ కోసం చెల్లించిన రూ.1000ల రశీదు, డాక్యుమెంట్ జిరాక్స్ కాపీలు తీసుకొని మునిసిపల్ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో సంప్రదించాలన్నారు. వివరాలకు కార్యాలయ పని వేళల్లో సీనియర్ అసిస్టెంట్ బి.జగన్‌మోహన్‌ను 9393007768 నంబరులో సంప్రదించాలన్నారు.

పథకాల అమల్లో వేగం పెంచాలి

- రుణమాఫీ పూర్తి చేయకపోతే మూల్యం తప్పదు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు
- ముగిసిన సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

బాలసముద్రం, ఆగస్టు 24 : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలతో ఇతర సంక్షేమ పథకాల అమల్లో వేగం పెంచాలని, అలాగే హామీలను కూడా వెంటనే నెరవేర్చాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. మూడురోజులుగా హనుమకొండ హరితహోటల్‌లో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు శనివారం ముగిశాయి. ఈ ముగింపు సమావేశాల్లో సీపీఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ నారాయణ, అజీజ్ పాషాతో కలిసి మాట్లాడిన ఆయన ప్రభుత్వం ధరణి స్థానంలో ఆర్ఓఆర్ చట్టం ముసాయిదాపై లోతుగా చర్చించి అందరి అభిప్రాయాలు తీసుకుని చట్టం తీసుకురావాలని సూచించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా ఉన్నమాట వాస్తవమే అయినా, హామీల అమల్లో ఇలానే వ్యవహరిస్తే ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతు భరోసా, పంటల బీమా పథకం, కొత్త రేషన్‌కార్డులు, ఇళ్లు, ఇళ్లస్థలాలు, పించన్ల పెంపు అమలుకు తక్షణం పూనుకోవాలన్నారు. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు హామీ సక్రమంగా కొనసాగుతున్నదని హర్షం వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీ బకాయిలు ఉన్న నేపథ్యంలో ఆశించిన స్థాయిలో అమలు కావడంలేదన్నారు. రేషన్ కార్డులు లేకపోవడంతో, పలు సాంకేతిక కారణాల వల్ల 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ రూ.500లకు గ్యాస్ సిలిండర్ హామీలు పేదలందరికీ వర్తించడంలేదన్నారు. సాంకేతిక కారణాల వల్ల రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదని, తక్షణం ప్రభుత్వం రూ.2లక్షల్లోపు రుణమాఫీ పూర్తి చేయకపోతే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇటీవలి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పాలక, ప్రతిపక్షాల ఆరోపణలతో ఎక్కువ సమయం వృథా అయిందని, ప్రజల సమస్యలపై అంతంత మాత్రంగానే చర్చ జరిగిందన్నారు. అర్థవంతమైన చర్చలకు, శాసనసభ వేదికగా ఉండాలని అప్పుడే ప్రజల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ప్రభుత్వానికి సూచించారు.

ముగిసిన సమావేశాలు

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు శనివారం ముగిశాయి. 22వ తేదీన ప్రారంభమైన ఈ నిర్మాణ సమావేశాలకు రాష్ట్రసమితి సభ్యులు, ఆహ్వానితులు మొత్తం 124 మంది హాజరయ్యారు. రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రవేశపెట్టిన నివేదికపై, పార్టీ నిర్మాణంపై విస్తృతంగా జరిగిన చర్చలో వివిధ జిల్లాలకు చెందిన సభ్యులు పాల్గొన్నారు. రాజకీయ, సామాజిక అంశాలపై సభ్యులు చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. భవిష్యత్ రాజకీయ కార్యాచరణను నిర్ణయించారు. మొదటిరోజు పార్టీ పతాకాన్ని జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా ఆవిష్కరించి సమావేశాలను ప్రారంభించారు. సీపీఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్‌పాషా, చాడా వెంకట్‌రెడ్డి, పశ్యపద్మ, వల్లా వెంకట్‌రెడ్డి రాష్ట్ర రాజ కీయ పరిస్థితులు, పరిణామాలు, పార్టీ నిర్మాణం, విస్తరణ, పటిష్టం చేయడం తదితర అంశాలపై తమ సందేశాలిచ్చారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

మునిసిపాలిటీ ఏర్పాటుకు త్వరలోనే ఉత్తర్వులు

పైసా ఖర్చు కాకుండా పథకాలు అందజేత

చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి



లబ్ధిదారులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 24: స్టేషన్‌ఘన్‌పూర్ మునిసిపాలిటీ ఏర్పాటుకు త్వరలోనే ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అవుతాయని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శనివారం డివిజన్ కేంద్రంలోని రైతువేదికలో ఆయన కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. 91 మందికి రూ.91,10,556 విలువైన కల్యాణలక్ష్మి చెక్కులను, 36 మందికి రూ.7,43,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ కేంద్రంలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి, ఇంటిగ్రేటెడ్ రెవెన్యూ డివిజన్ కేంద్రం ఏర్పాటుకు, ఘన్‌పూర్‌ను మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసేందుకు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం సీఎంకు ప్రతిపాదనలు పంపామని, త్వరలోనే అనుమతులు వస్తాయని అన్నారు. గత పాలకుల కాలంలో నియోజకవర్గం నిర్లక్ష్యానికి గురైందని, ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరుగలేదని, ప్రభుత్వ పథకాలను అమ్ముకున్నారని, ప్రభుత్వ భూములను కాపాడలేక పోయారని ఆరోపించారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, నాయకులు బెలిదె వెంకన్న, చింతకుంట్ల నరేందర్ రెడ్డి, జూలకుంట్ల శిరీష్ రెడ్డి, ఇనుగాల వెంకటేశ్వర్ రెడ్డి, పోగుల సారంగపాణి, బూర్ల శంకర్, కోతి రాములు, నాగరబోయిన యాదగిరి, చాడ రాజ్‌కుమార్, పోశాల క్రిష్ణమూర్తి, తోట వెంకన్న, లింగనబోయిన శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు కృష్ణాష్టమి

కృష్ణుడు, గోపికల వేషధారణతో అలరించిన విద్యార్థులు

వివరాలు 8వ పేజీలో...

జనగామ శంకర్‌కు సాహితీ పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న జనగామ శంకర్

జనగామ కల్చరల్, ఆగస్టు 24: తెలంగాణ సాంస్కృతిక సారథి సభ్యుడు జనగామ శంకర్ రాష్ట్ర సాయి సాహితీ పురస్కారం అందుకున్నారు. ప్రముఖ కవి, కథ, నవలా రచయిత, విమర్శకులు, సామాజిక తత్వవేత్త, బీసీ కమిషన్ తొలి చైర్మన్ బీ.ఎస్.రాములు 75వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. ఇటీవల రవీంద్రభారతిలో విశాలసాహితీ అకాడమీ, సామాజిక తాత్విక విశ్వవిద్యాలయం, సాహిత్య అకాడమీ, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన బీ.ఎస్.రాములు జన్మదిన అమృత మహోత్సవాలలో రాష్ట్ర స్థాయి బీ.ఎస్.రాములు సాహితీ పురస్కారాన్ని అందుకున్నారు. బీ.ఎస్.రాములు స్వయంగా శంకర్‌కు ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ అప్పటికప్పుడు బీ.ఎస్.రాములు జీవితం, సాహితీ రంగంలో చేసిన సేవలను రచించి, స్వరకల్పన చేసి గానం చేశారు. అనంతరం బీ.ఎస్.రాములును శాలువాతో ఘనంగా సన్మానించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

విద్యార్థులకు సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్ సూచన

జనగామ రూరల్, ఆగస్టు 24: విద్యార్థులు చదువుతో పాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ అన్నారు. శనివారం జనగామ మండలం శామీర్‌పేటలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. భోజనశాలను, పాఠశాల ఆవరణను పరిశీలించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ తల్లిదండ్రుల ఆశయాలు, కలలు నెరవేర్చాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.కుమారస్వామి, స్కూల్ కోఆర్డినేటర్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి విక్రమ్

డ్రగ్స్‌తో అనర్థాలపై అవగాహన కల్పించాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, ఆగస్టు 24 : విద్యార్థుల ప్రవర్తనపై కళశాలల యాజమాన్యాల నిరంతర పర్యవేక్షణ ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. శనివారం హనుమకొండలోని కమిషనరేట్ కార్యాలయంలో నగరంలోని ఇంటర్, డిగ్రీ కళశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కళాశాలల యాజమన్యాలను నమ్మి పిల్లలను తల్లిదండ్రులు పంపిస్తున్నారని, విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కళాశాలల్లో విద్యార్థుల భాగస్వామ్యంతో యాంటీ డ్రగ్స్ విభాగాన్ని ఏర్పాటు చేయాలన్నారు. మత్తు పదార్థాల వినియోగం వలన జరిగే నష్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హాస్టల్స్, క్యాంటీన్‌లలో తనిఖీలు నిర్వహించాలన్నారు. కళాశాల పరిసరాల్లో గంజాయి సేవించినట్లు గుర్తిస్తే తమకు సమాచారం అందించాలని కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు షేక్ సలీమా, రవిందర్, ఏసీపీలు జితెందర్, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

హాకీకి పునర్వైభవం వచ్చేనా?

నేడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి, జాతీయ క్రీడా దినోత్సవం

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 24 : విశ్వ క్రీడ వేదిక పై భారత దేశ కీర్తి ప్రతిష్టలు ఇనుమడించేలా ప్రపంచానికి కనిపించే విధంగా ఒలంపిక్స్ పురుషుల హాకీ జట్టుకు ప్రాతినిత్యం వహించి ఏకాంగా హ్యాట్రిక్ పసిడి పతకాలను అందించిన హాకీ దిగ్గజం మాణికట్టు మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్. తన క్రీడా ప్రతిభతో మైదానంలో రాకెట్‌లా దూసుకుపోతూ ప్రత్యర్థులను చిత్తు చేస్తూ గోల్స్ చేసేవాడు. దేశవాలి క్రీడగా ప్రాచుర్యం పొందిన హాకీ క్రీడలో 1936సంవత్సరం మాస్కో విశ్వ క్రీడల్లో ధ్యాన్‌చంద్ సారథ్యంలో మన జట్టు చివరి పసిడి అందుకున్నాక భారత హాకీ ప్రమాణాలు పూర్తిగా దిగజారాయి. అంతర్జాతీయ స్థాయి పోటీలో ధ్యాన్ చంద్ స్ఫూర్తితో భారత్‌కు మరో ఐదు స్వర్ణాలు, ఒక రజతం రెండు కాంస్య పతకాలతో సరిపెట్టుకొని అ తరువాత ఏలాంటి పతకాలు సాధించకుండా నాలుగు దశాబ్దాలుగా వేచి చూడాల్సి వచ్చింది. 2021లో టోక్యోలో నిర్వహించిన ఒలంపిక్స్ హాకీ క్రీడలో భారత దేశ జట్టు తరుపున మన్‌ప్రీత్‌సింగ్ సారథ్యంలో 4దశబ్ధాల నిరీక్షణకు తెరతీస్తు చారిత్రాత్మక విజయాన్ని దేశానికి అందించి కాంస్య పతకంతో హాకీ ప్రేమికుల్లో నూతనోత్సాహం నింపాడు. అదే విధంగా ఆగస్టు 2024 పారిస్‌లో జరిగిన ఒలంపిక్స్ హాకీ క్రీడలో తృతీయ స్థానంలో నిలిచి వరుసగా రెండో సారీ కాంస్య పతకం సాధించి దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకవచ్చారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ మరణం తరువాత ఒలంపిక్స్‌లో దేశానికి రెండు కాంస్య పతకాలు అందించిన స్ఫూర్తిని నేటీ క్రీడాకారులు తీసుకొని రాణించాల్సిన అవసరం ఉంది. 1905 ఆగస్టు 29న ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన సాధించిన ఘనతకు గుర్తుగా భారత ప్రభుత్వం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ప్రతి ఏట నిర్వహించడం ఆనవాయితిగా వస్తుంది.

ప్రధానంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో హాకీ క్రీడను ప్రోత్సహించే వారు లేక పోవడం, వర్థమాన క్రీడాకారులకు శిక్షణ అందించే అసోసియేషన్లు పూర్తి స్థాయిలో పర్యావేక్షణ లోపం కారణంగా ఈ క్రీడ పట్ల ఆసక్తి చూపడం లేదని పలువురు సీనియర్ క్రీడాకారులు వాపోతున్నారు. కోచ్‌లు సైతం అందుబాటులో లేకపోవడంతో ఈ క్రీడ అంతరించి పోయే అవకాశాలు ఉన్నాయని క్రీడాభిమానులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. హనుమకొండ జేఎన్‌ఎస్‌ఎస్‌లో పలు క్రీడలకు వేదికలు, కోర్టులు ఉన్నప్పటికీ దేశవాళి క్రీడగా ప్రసిద్ధి గాంచిన హాకీ క్రీడకు మైదానం లేకపోవడంతో ఈ క్రీడ పట్ల జిల్లా క్రీడా సమాఖ్య ఎంత నిర్లక్ష్యం చేస్తుందో ఇట్టే అర్థమవుతోంది.

సండే స్పెషల్ SUNDAY SPECIAL



భలే చౌక.. జర్నీ

- తక్కువ చార్జీకే గమ్యస్థానాలకు
- అందుబాటులో పలు యాప్‌లు
- వినియోగించుకుంటున్న నగరవాసులు

రాంనగర్, ఆగస్టు 24: త్రినగరిలో చాలా చౌకగా.. తక్కువ చార్జీకే గమ్యస్థానాలకు చేర్చేందుకు పలు యాప్‌ల ద్వారా వాహనాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ అవకాశాన్ని వరంగల్, హనుమకొండ, కాజీపేట (త్రి నగరి) ప్రజలు వినియోగించుకుంటున్నారు. పలు యాప్‌లు కార్పొరేషన్ పరిధిలో తమ సేవలను అందిస్తుండగా ఆ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని రైడ్ బుక్ చేసుకుంటే చాలు నిలుచున్న స్థానం నుంచి సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకునే సౌకర్యం కలుగుతోంది. ఉరుకుల పరుగుల జీవితంలో ఈ యాప్‌లు ఎంతగానో సౌకర్యవంతంగా ఉన్నాయని నగరవాసులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ మూడు యాప్‌లు నగర పరిధి లోనే అందుబాటులో ఉండగా వినియోగదారుల అభిప్రాయం మేరకు మున్ముందు హైదరాబాద్ వరకు సర్వీసు అందించే అవకాశం ఉన్నట్లు ఆయా సంస్థల ప్రతినిధులు చెబుతున్నారు.

అందుబాటులో యాప్‌లు..
చౌకగా ప్రయాణం..

ప్రస్తుతం నగరంలో ఓలా, ఊబర్, ర్యాపిడో యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. మూడు యాప్‌లు బైక్, ఆటో, కార్ సౌకర్యం కల్పిస్తున్నాయి. యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఇంటి బుక్ చేసుకుంటే క్షణాల్లో ఇంటికి వాహనం వస్తుంది. యాప్‌ల ద్వారా బుక్ చేసుకునే వాహనాలు, ఇతర రెంటెడ్ వాహనాలకు చార్జీల్లో చాలా తేడా ఉంటోంది. చౌకగా కోరుకున్న స్థానానికి చేరుకోవచ్చు. ఏ టైమ్‌లోనైనా యాప్‌ల ద్వారా ప్రయాణం సురక్షితమని, ఒకరి కంటే ఎక్కువ ఉన్నవారు ఈ సౌకర్యాన్ని వినియోగించుకుంటే బయటికంటే సగం చార్జీలకంటే మించకుండా ప్రయాణం చేసే వీలుందని వినియోగదారులు చెబుతున్నారు. కార్పొరేషన్ పరిధిలో ఉద్యోగాలు చేసేవారు, విద్యార్థులు బైక్‌లను బుక్ చేసుకుని వెళుతున్నారు. ఈ క్రమంలో బైక్ సర్వీసుకు గిరాకీ బాగానే ఉన్నట్టు తెలిసింది. వరంగల్ కోట, వేయిస్తంభాల దేవాలయం, భద్రకాళి ఆలయం, కాజీపేట, వరంగల్ రైల్వే జంక్షన్‌లు, బస్టాండ్లకు ఆటో, బైక్‌ను ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఒకరికంటే ఎక్కువ మంది ప్రయాణం చేయాల నుకునేవారు ఆటో లేదంటే కారు సర్వీసును వినియోగిస్తున్నారు. సొంత కార్లు ఉన్నవారు సైతం ఈ యాప్‌లపై ఆధారపడుతుండటం విశేషం. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు ఉన్ననేపథ్యంలో సొంతవాహనాలున్న వారు కూడా ఇబ్బందుల నుంచి తప్పించుకునేందుకు ఈ యాప్‌ల వైపు మొగ్గుచూపుతున్నట్టు తెలుస్తోంది.

కొన్ని ప్రాంతాలకు వసూలు చేస్తున్న చార్జీలిలా (సుమారుగా)

- **ఓలా సర్వీసు:** కేయూ జంక్షన్ నుంచి కాజీపేట రైల్వే స్టేషన్ వరకు 7.5 కి.మీ దూరానికి బైక్ రూ.58, ఆటో (ముగ్గురు) రూ.114, కార్ (నలుగురు) రూ.230 చార్జీ ఉంటుంది. అదే కేయూ జంక్షన్ నుంచి వరంగల్ రైల్వే స్టేషన్‌కు 8కి.మీ దూరానికి బైక్ రూ.80, ఆటో రూ.140, కారు రూ.300చార్జి వసూలు చేస్తున్నారు.
- **ఊబర్ :** కేయూ జంక్షన్ నుంచి కాజీపేట రైల్వేస్టేషన్‌కు ఆటో రూ.114, కారు రూ.215 చార్జీ ఉంటుంది. కేయూ జంక్షన్ నుంచి వరంగల్ రైల్వే స్టేషన్ వరకు ఆటో రూ.160, కారు రూ.318 చార్జీ.
- **ర్యాపిడో:** కేయూ జంక్షన్ నుంచి కాజీపేట రైల్వే స్టేషన్‌కు బైక్ రూ.77, ఆటో రూ.120, కారురూ.207 చార్జీ తీసుకుంటున్నారు. ఇక కేయూ జంక్షన్ నుంచి వ రంగల్ రైల్వేస్టేషన్ వరకు బైక్ అయితే రూ.100, ఆటో కు రూ.160, కారు రూ.270 చార్జీ.

తక్కువ చార్జీతో గమ్యస్థానం చేరుకోవచ్చు

- గద్దం కుమారస్వామి, వ్యాపారి



ఈ యాప్‌లు సద్వినియోగం చేసుకోవడం ద్వారా తక్కువ చార్జీతో గమ్యస్థానం చేరుకోవచ్చు. సొంత వాహనాలు ఉన్నా నగరంలోని ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ యాప్‌లను వినియోగించుకుంటున్నా. మేం ఉంటున్న విద్యారణ్యపురి నుంచి భద్రకాళి, వేయిస్తంభాల ఆలయంతో పాటు నగరంలోని ఇతర ప్రాంతాలకు కుటుంబసభ్యులతో వెళ్లాలనుకుంటే కారు లేదా ఆటో బుక్ చేసుకుంటాం. ముగ్గురం రూ. 120చార్జీ మించకుండా ఆలయానికి వెళతాం. వరంగల్ రైల్వేస్టేషన్‌కు వెళ్లాలనుకున్నా రూ.200 మించదు. ప్రైవేటు వాహనాల్లో వెళ్లాలనుకుంటే రూ.300కంటే ఎక్కువవుతుంది. ఈ యాప్‌లు అందుబాటులోకి రావడంతో డబ్బులు ఆదా, ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎస్ఆర్ విద్యాసంస్థల డైరెక్టర్ సంతోష్‌రెడ్డి తదితరులు

వేడుకగా 'ఎస్ఆర్' డైరెక్టర్ కూతురి వివాహ రిసెప్షన్

మడికొండ, ఆగస్టు 24: ఎస్ఆర్ విద్యా సంస్థల డైరెక్టర్ సంతోష్‌రెడ్డి ప్రథమ కుమార్తె సంజన-గౌతమ్‌ల రిసెప్షన్ వేడుక మడికొండలోని రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, రాజకీయ, వ్యాపార వర్గాలకు చెందిన ప్రముఖులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ వరదారెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎంజీఎం సూపరింటెండెంట్‌గా డాక్టర్ స్వర్ణకుమారి

- కేఎంసీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ మురళీకృష్ణ
- భూపాలపల్లి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాజేంద్రప్రసాద్

వరంగల్ మెడికల్, ఆగస్టు 24 : ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ పి.స్వర్ణకు మారి నియమితులయ్యారు. కేఎంసీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ వి. మురళీకృష్ణను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జీవో ఆర్టీ నెంబర్ 417ను విడుదల చేశారు. డాక్టర్ జి.స్వర్ణకుమారి 2005 వరకు ఎంజీఎం ఆస్పత్రిలో డెర్మటాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తించారు.

అనంతరం ఉస్మానియా ఆస్పత్రికి అసోసియేట్ ప్రొఫెసర్‌గా బదిలీ అయ్యారు. ఇటీవలే ప్రొఫెసర్‌గా పదోన్నతి పొంది తిరిగి ఎంజీఎంలోనే ప్రస్తు తం పని చేస్తున్నారు. ప్రస్తుతం సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. కాగా, డాక్టర్ జి.స్వర్ణకుమారి ఈ విధుల్లో చేరేందుకు కుటుంబ సమస్యల కారణంగా నిరాకరిస్తున్నట్లు తెలుస్తోంది. కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులైన డాక్టర్ వి.మురళీకృష్ణ ఇటీవలే ఎంజీఎం ఆస్పత్రికి పిల్లల విభాగం ప్రొఫెసర్‌గా విభాగం అధిపతిగా బదిలీపై వచ్చారు. నీలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పని చేసిన అనుభవం కూడా ఉంది.

భూపాలపల్లి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ పి. రాజేంద్ర ప్రసాద్ నియమితులయ్యారు. ఎంజీఎం ఆస్పత్రి జనరల్ మెడిసిన్ విభాగంలో సుదీర్ఘకాలం పాటు ప్రొఫెసర్‌గా పనిచేశారు. వరంగల్ సీకేఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా కూడా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం భూపాలపల్లి మెడికల్ కళాశాలలో రాజేంద్రప్రసాద్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాడు.

అలాగే హనుమకొండలోని ప్రభుత్వ టీబీ, చాతి వ్యాధుల ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ సి.సంజీవ్ కుమారి నియమితులయ్యారు. ఎంజీఎం ఆస్పత్రి రేడియో థెరపీ ప్రొఫెసర్‌గా ప్రస్తుతం పని చేస్తున్నారు.

హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ రాజేశ్వరి, వరంగల్ సీకేఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ జి.షర్మిల, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్‌గా డాక్టర్ రాజాభరత్ కుమార్‌లను ప్రభుత్వం నియమించింది.

డెంగీతో బీటెక్ విద్యార్థి మృతి

- నాలుగు రోజుల్లో డెంగీతో ఇద్దరు మృతి
- భయాందోళనలో తొర్రూరు పట్టణప్రజలు



ప్రేమ్‌కుమార్ (ఫైల్)

తొర్రూరు, ఆగస్టు 24 : డెంగీ జ్వరంతో ఓ బీటెక్ విద్యార్థి మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో శనివారం చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి కుటుంబసభ్యుల కథనం ప్రకారం. నర్సింహులపేట మండల కేంద్రానికి చెందిన బేతమల్ల రమేష్-లక్ష్మీకాంత దంపతులు గత 20 ఏళ్లుగా తొర్రూరు పట్టణంలో నివాసం ఉంటున్నారు. వారికి కుమారుడు ప్రేమ్‌కుమార్, కుమార్తె ప్రియాంక సంతానం. రమేష్ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కుమారుడు బేతమల్ల ప్రేమ్‌కుమార్ (23) బీటెక్ ఫైనల్ ఇయర్ వరంగల్‌లోని వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజిలో చదువుతూ, ఇటీవల కోచింగ్ కోసం హైదరాబాద్‌కు వెళ్లాడు. ఈనెల 19వ తేదీన రాఖీ పండుగకు తన చెల్లెలుతో రాఖీ కట్టించుకునేందుకు తొర్రూరుకు రాగా, జ్వరం వచ్చింది. 22వ తేదీన తొర్రూరులోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా రక్తకణాల సంఖ్య తక్కువగా ఉందని అడ్మిట్ కావాలనడంతో.. 23న పట్టణంలోని మరో ఆస్పత్రికి చికిత్స కోసం వెళ్లారు. ప్రేమ్‌కుమార్‌కు డాక్టర్లు పరీక్షలు నిర్వహించి, పరిస్థితి విషమంగా ఉందని.. పెద్ద ఆస్పత్రికి వెళ్లాలని సూచించడంతో ఖమ్మంలోని సురక్ష దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున 4 గంటలకు మృతి చెందాడు. కాగా, మృతుడి సోదరి ప్రియాంక బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. చేతికందిన కొడుకు మృతి చెందడంతో కుటుంబసభ్యులు బోరున విలపించారు. కొద్ది రోజుల్లో కుమారుడు చేదోడు వాదోడుగా నిలుస్తాడని కోటి ఆశలతో ఎదురు చూస్తున్న తల్లిదండ్రులకు తీవ్ర నిరాశ ఎదురైందని ఆవేదన వ్యక్తం చేశారు.

పారిశుధ్య నిర్వహణ లోపం

నాలుగు రోజుల వ్యవధిలో డెంగీ జ్వరంతో ఇద్దరు మృతి చెందడంతో తొర్రూరు ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈనెల 20వ తేదీన పట్టణ కేంద్రానికి చెందిన హత్విక (4) డెంగీతో మృతి చెందిన విషయం తెలిసిందే! పట్టణంలో డంపింగ్ యార్డు లేకపోవడంతో మునిసిపాలిటీ సిబ్బంది చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయడంతో పారిశుధ్య లోపం ఏర్పడి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి.

బీఆర్ఎస్‌వి బూటకపు ధర్నాలు

- రుణమాఫీపై వారివి అసత్య ప్రచారాలు
- మీడియాతో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, ఆగస్టు 24 : రుణమాఫీపై బీఆర్ఎస్ నాయకులవి బూటకపు ధర్నాలని తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ఆరోపించారు. వాస్తవాలను వక్రీకరిస్తూ రైతులను ఆందోళనకు గురి చేస్తున్న బీఆర్ఎస్ నాయకులకు తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. శనివారం హనుమకొండలోని డీసీసీబీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ. 2 లక్షల రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. దేశంలోనే రుణమాఫీ చారిత్రాత్మకమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేని బీఆర్ఎస్ నేతలు తప్పుడు మార్గాలను ఎంచుకుంటున్నారని మండిపడ్డారు.

ఖమ్మంలో సంకెళ్లు వేసిన ఘటనను రైతులు మరువలేదు

రుణమాఫీని వక్రీకరిస్తూ రైతులను రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధి పొందాలని బీఆర్ఎస్ నేతలు ఆరాటపడుతున్నారని రవీందర్‌రావు దుయ్యబట్టారు. బీఆర్ఎస్ హయంలో ఖమ్మంలో రైతులకు సంకెళ్లు వేసిన ఘటన ఇంకా రైతులు మరచిపోలేదన్నారు. రైతులు బీఆర్ఎస్‌ను అధికారం నుంచి దించివేసినా ఇంకా ఆ పార్టీ నేతలు కళ్లు తెరవలేదన్నారు. రైతుల పొట్ట కొట్టిన బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు రుణమాఫీపై తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. సహకార సంఘాల ద్వారా దశల వారిగా రుణమాఫీ ప్రకటించిన ప్రభుత్వం 27 రోజుల్లోనే 22 లక్షల మంది రైతులకు మొత్తంగా రూ. 18 కోట్ల రుణమాఫీ నిధులు బ్యాంకుల్లో జమ చేయడం జరిగిందని వివరించారు.

అర్హులందరికీ రుణమాఫీ తప్పక వర్తింపు

బీఆర్ఎస్ నాయకుల అసత్య ప్రచారాలను రైతులు నమ్మవద్దని రవీందర్‌రావు కోరారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ తప్పక జరుగుతుందని చెప్పారు. సాంకేతిక సమస్యలు కొన్ని ఇతర కారణాల వల్ల కొందరు రైతులకు మాఫీ జరగడంలో జాప్యం జరిగిందన్నారు. అయితే ప్రభుత్వం వెను వెంటనే సమస్య పరిష్కార చర్యలు చేపట్టిందన్నారు. ఈ మేరకు ఎవరైతే అర్హులైన రైతులు సమస్యలు ఎదుర్కొన్నారు పరిష్కార చర్యలతో రుణమాఫీ లబ్ధి పొందుతున్నారని వివరించారు. అధికారంలో ఉండగా ఏనాడు రైతుల కష్టాలు పట్టించుకోని బీఆర్ఎస్ నాయకులు ఇకనైనా రాజకీయ స్వార్థాన్ని మరిచి రైతులకు మేలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి సహకరిస్తే మంచిదన్నారు. లేని పక్షంలో రైతుల నుంచి గుణపాఠం తప్పదని బీఆర్ఎస్ నేతలను హెచ్చరించారు. బీఆర్ఎస్ దగాకోరు మాటలను నమ్మవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ రైతుల ప్రభుత్వమని పేర్కొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

బచ్చన్నపేట, ఆగస్టు 24: మండలంలోని కట్కూరు గ్రామంలో శనివారం రాత్రి బొడ్డు కర్ణాకర్ (28) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. నాలుగు మాసాల క్రితం తను ఫైనాన్స్‌లో ట్రాలీ ఆటో తీసుకుని నడుపుకుంటుండగా, సరైన గిరాకీ లేక కిస్తీలు చెల్లించలేకపోయాడని, దీంతో ఈనెల 23న ఫైనాన్స్ కంపెనీ వారు ఆటోను తీసుకెళ్లారని గ్రామస్థులు తెలిపారు. దీంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరేసుకొని చనిపోయాడని వివరించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఎస్సై సతీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

నర్మెట, ఆగస్టు 24: మండలంలోని హన్మంతాపూర్ గ్రామంలో ఓ వివాహిత అదృశ్యమైన సంఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై నగేష్ తెలిపిన వివరాల ప్రకారం.. హన్మంతాపూర్ గ్రామానికి చెందిన ఇరుగు నరేష్‌కు, హైద్రాబాద్‌కు చెందిన స్వాతితో 2018లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత నెల 19న నరేష్ కాశీ యాత్రకు వెళ్లి 23న తిరిగి ఇంటికి వచ్చేసరికి భార్య స్వాతి కనిపించలేదు. ఇద్దరు పిల్లలు నరేష్ తల్లి దగ్గర ఉన్నారు. స్వాతి గురించి ఇన్ని రోజులు బంధువులు, చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో భర్త నరేష్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్వాతి ఆచూకి తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్సై నగేష్ కోరారు.

దాడిచేసిన వ్యక్తి అరెస్ట్

దేవరుప్పుల, ఆగస్టు 24: మండలంలోని కడవెండి గ్రామానికి చెందిన సుడిగాల వెంకటయ్య అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన బెల్లి అజయ్ దాడి చేయగా ఎస్సై సృజన్‌కుమార్ కేసు నమోదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన ఎస్సై శనివారం అజయ్‌ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ద్విచక్ర వాహనం దొంగిలించిన వ్యక్తి అరెస్ట్

బచ్చన్నపేట, ఆగస్టు 24: ద్విచక్ర వాహనం దొంగిలించిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరు గ్రామానికి చెందిన షేక్ ఖయ్యూం ఈ నెల 21న బచ్చన్నపేట ఎస్సీ గార్డెన్‌లో టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనాన్ని ఎత్తుకెళ్లాడు. శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా చౌరస్తాలో అనుమానస్పదంగా కనిపించటంతో అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. దీంతో అతడిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్టు ఎస్ఐ సతీష్ తెలిపారు.

వ్యాపారులకు పోలీసుల నోటీసులు

దేవరుప్పుల, ఆగస్టు 24: మండలకేంద్రంలో సీసీ కెమెరాలు లేని వ్యాపార సంస్థల యజమానులకు శనివారం ఎస్సై సృజన్‌కుమార్ నోటీసులు అందజేశారు. హైవేపై దొంగతనాలు జరుగుతున్నందున సీసీ కెమెరాలు ఉంటే అరికట్టవచ్చన్నారు. అందువల్ల దేవరుప్పుల మెయిన్‌రోడ్డుపై ఉన్న దుకాణదారులందరూ తప్పకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలి

జనగామ రూరల్, ఆగస్టు 24: వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని డీఈవో రాము సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలో మండలంలోని ప్రాథమికోన్నత, హైస్కూల్ హెచ్‌ఎంలకు ఎంఆర్‌సీ నోడల్ అధికారి వంగాల రాజేందర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పాఠశాలలో అకాడమిక్, అడ్మినిస్ట్రేటివ్ విషయాలను తప్పనిసరిగా అమలు పరుచాలన్నారు. నవంబర్‌లో జరిగే ఎన్ఏఎస్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు.

27న బైక్‌లకు వేలం

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 24: వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలకు ఈ నెల 27న స్టేషన్‌ఘన్‌పూర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ భాస్కర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కేసుల్లో పట్టుబడిన 23 బైక్‌లకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వ్యక్తులు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

'పకడ్బందీగా ఓటరు సర్వే చేపట్టాలి'

బచ్చన్నపేట, ఆగస్టు 24: ఓటరు సర్వేను గ్రామాల్లో బీఎల్‌వోలు పకడ్బందీగా చేపట్టాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఫణి కిశోర్ సూచించారు. శనివారం రెవెన్యూ కార్యాలయంలో బీఎల్‌వోలతో ఆయన సమావేశం నిర్వహించారు. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు పరిశీలించి మార్పులు చేర్పులను ఓటర్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో ఇతర ప్రాంతాల్లో పేరు నమోదై ఉన్న విషయంలో క్లారిటీ చూసుకోవాలన్నారు.







జనగామ ఏకశిల పబ్లిక్ స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు, శ్రీ అరబిందో పాఠశాలలో గోపికలు, కృష్ణుని వేషధారణలతో చిన్నారులు, సెయింట్ మేరీస్ పాఠశాలలో చిన్నారులతో ప్రిన్సిపాల్ జైమోన్ థామస్, ఉపాధ్యాయులు

పాఠశాలల్లో ముందస్తు కృష్ణాష్టమి

● అలరించిన చిన్నారుల వేషధారణలు

జనగామ కల్చరల్, ఆగస్టు 24: శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల్లో చిన్నారుల వేషధారణలు అలరించాయి. శనివారం జనగామ ఏకశిల పబ్లిక్ స్కూల్, సెయింట్ మేరీస్ హైస్కూల్, శ్రీ అరబిందో హైస్కూల్‌లో ముందస్తు వేడుకలు నిర్వహించారు. ఏకశిల పబ్లిక్‌స్కూల్‌లో కరస్పాండెంట్ సి.ఉపేందర్‌రెడ్డి హాజరై విద్యార్థులకు కృష్ణాష్టమి ప్రాధాన్యతను వివరించారు. శ్రీ అరబిందోస్కూల్‌లో విద్యార్థులు రాధాకృష్ణులు, గోపికల వేషధారణలతో హాజరయ్యారు. అనంతరం ఉట్లు కొట్టే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇ.ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీకృష్ణాష్టమి విశిష్టత, జన్మ వృత్తాంతాన్ని వివరించారు. సెయింట్ మేరీస్ పాఠశాలలో చిన్నారులు గోపికలు, కృష్ణుని వేషధారణలతో వేడుకల్లో పాల్గొన్నారు. ఉట్టి కొట్టే కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జైమోన్ థామస్, పీఆర్‌వో రంగరాజు ప్రసాద్, ప్రమీల, రాజిరెడ్డి, నర్మద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిలుపూర్: కొండాపూర్ పరిధిలోని ఎర్రకుంట తండా, ఫతేపూర్, పల్లగుట్ట, చిన్నపెండ్యాల తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ముందస్తుగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, గోపిక తదితర వేషాలను వేసి నృత్య ప్రదర్శన ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: చిన్నరామన్‌చర్ల శివారు మొండికుంట వద్దగల బిషప్ తుమ్మబాల హైస్కూల్‌లో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిపారు. హెచ్‌ఎం ఫాదర్ వై బాల నేతృత్వంలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, ఉట్టి కొట్టడం, శ్లోక పఠనం, మ్యూజికల్ చైర్ నిర్వహించారు. శ్రీకృష్ణుని జన్మ విశిష్టతను, గీత సారాంశాన్ని వివరించారు. విద్యార్థులు శ్రీకృష్ణుని, బాలికలు గోపికల వేషాధారణతో అలరించారు.



బచ్చన్నపేట తుమ్మబాల హైస్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమిని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు గోపిక, శ్రీకృష్ణుడి వేషధారణలో అలరించారు. ఛాగల్ ఉన్నత పాఠశాలలో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు.

నర్మెట: హన్మంతాపూర్ ప్రాథమిక పాఠశాలలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణతో ఆకట్టుకున్నారు. ఉట్టి కొట్టి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దూడల రమేష్, అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్మన్ వి.ఆశలత, ఉపాధ్యాయులు పి. లలిత, విద్యావతి, సీఆర్పీ రవీందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఉత్సవాలు

జఫర్‌గఢ్, ఆగస్టు 24: భక్తుల కొంగు బంగారంగా ప్రసిద్ధి చెందిన శ్రీవేల్పుగొండ లక్ష్మీనర్సింహస్వామి జాతర మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఏటా శ్రావణమాసంలో నెల రోజుల పాటు స్వామి వారి ఉత్సవాలు జరుగుతాయి. శ్రీలక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వందలాదిగా భక్తులు తరలి వస్తున్నారు. మూడో శనివారం కొండపై భక్తులు పోటెత్తారు. సుమారు 1600 మీటర్ల ఎత్తులో గల స్వామి వారి కొండపైకి పిల్లాపాపలతో భక్తులు చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు. పిల్లా పాపలతో సల్లంగ చూడాలని, వర్షాలు బాగా కురిసి పంటలు సమృద్ధిగా పండాలని స్వామివారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారి కీర్తనలు, భక్తుల జయజయ ధ్వానాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. పండితులు పొడిచేటి సగంపాలు వెంకటాచార్యులు నేతృత్వంలో స్వామి వారికి అర్చనలు, పూజలు గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు నివేదించారు. ఆలయం, స్వామివారి ప్రాశస్త్యాన్ని భక్తులకు వివరించారు.



కోనేరు వద్ద భక్తుల సందడి

అన్నదానం చేసిన ఆర్యవైశ్యులు..

స్వామి వారి దర్శనార్థం వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కొండ దిగువన అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రతినిధి సిహెచ్.కృష్ణమూర్తి, మండల అధ్యక్షుడు రేవూరి రమేశ్ మాట్లాడుతూ గత ఏడాది నుంచి స్వామి వారి శ్రావణమాసోత్సవాల్లో భక్తులకు ప్రతి శనివారం అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పాలకుర్తి రాజన్న, శ్రవణ్‌కుమార్, నాగరాజు, హరిశంకర్, యుగంధర్, మణికాంత్, దాంశెట్టి రామయ్య, సోమన్న, ఇమ్మడి అశోక్, గందె సీతరాములు, అంచూరి కమల, వాసవి, శ్రావ్య, అంబిక, స్రవంతి, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం కార్యవర్గ సభ్యుడిగా మహిపాల్



జనగామ రూరల్, ఆగస్టు 24: బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా జనగామ మండలం గానుగుపహాడ్‌కు చెందిన శానబోయిన మహిపాల్ నియమితులయ్యారు. ఈ మేరకు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సెవెళ్ల మహేందర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మహేందర్ మట్లాడుతూ మహిపాల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో ముందున్నారని, అదేవిధంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా ఆయన సేవలను గుర్తించి పార్టీ బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా నియమించిందన్నారు. రానున్న రోజుల్లో పార్టీకి మరిన్ని సేవలు అందించాలని సూచించారు. అనంతరం మహిపాల్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పజెప్పిన బాధ్యతలను తప్పకుండా నేరవేరుస్తానన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ పార్టీ అధికారంలోకి రావడానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

'ప్రతీరైతుకు రుణమాఫీ అవుతుంది'

కొడకండ్ల, ఆగస్టు 24: ప్రతీరైతుకు రుణమాఫీ జరుగుతుందని, ఎవరూ అధైర్యపడవద్దని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు డి.సురేష్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు చిల్లర రాజకీయాల మానుకోవాలని హితవు పలికారు. మండలకేంద్రంలో టెంట్‌లు వేసుకుని ధర్నా చేస్తున్నట్లు ఫొటోలకు ఫోజులిచ్చిన రైతులలో చాలామందికి రుణమాఫీ జరిగిందన్నారు. కావాలంటే నిరూపిస్తామని సవాలు విసిరారు. ఈ కార్యక్రమంలో రాజేష్ నాయక్, మసురం రవీందర్, అబ్దుల్లా, పి.మధుసూదన్, మనోహర్, శ్రీకాంత్, యాకేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



చిలుపూర్ ఆలయంలో స్వామి వారి వార కల్యాణం జరిపిస్తున్న పూజారులు

వేడుకగా వార కల్యాణం

చిలుపూర్, ఆగస్టు 24 : చిలుపూర్ గుట్ట బుగులు వేంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారి వార కల్యాణాన్ని శనివారం వేడుకగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరు కాగా, ఆలయ ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, సౌమిత్రి రంగాచార్యుల వేదమంత్రాల మధ్య వేంకటేశ్వర స్వామి - పద్మావతి అమ్మవార్ల కల్యాణ వేడుకలను వైభవంగా ముగించారు. అనంతరం కల్యాణంలో కూర్చున్న కుటుంబాలకు స్వామివారి శేష వస్త్రాలతో పాటు, తీర్థప్రసాదాలను అందజేశారు.

ఎన్‌సీసీ సర్టిఫికెట్‌తో ఉజ్వల భవిష్యత్



ఎన్‌సీసీ విద్యార్థులతో కల్నల్ సెంథిల్ రామదురై

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 24: ఎన్‌సీసీ విద్యార్థులు చక్కని క్రమశిక్షణతో చదువులో రాణిస్తే ఎన్‌సీసీ సర్టిఫికెట్ ద్వారా భవిష్యత్తు బంగారుమయంగా మారుతుందని ఎన్‌సీసీ పదవ తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సెంథిల్ రామదురై తెలిపారు. శనివారం ఛాగల్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి పాఠశాలలో ఎన్‌సీసీ విద్యార్థుల శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో కేవలం రెండు ఎన్‌సీసీ ట్రూప్స్ ఉన్నాయని, అందులో ఒకటి ఛాగల్‌లో ఉండడం అభినందనీయమని అన్నారు. ఛాగల్ ఎన్‌సీసీ కేడెట్స్ ప్రతీ పోటీలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో రాణిస్తున్నారని తెలిపారు. ఎన్‌సీసీ విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకొని లక్ష్యం సాధన దిశగా శ్రమించాలన్నారు. ఢిల్లీలో నిర్వహించే ఆగస్టు 15, రిపబ్లిక్‌డే పరేడ్‌కు ఎంపిక కావాలన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకుంటే భవిష్యత్తు బాగుంటుందని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కొమురయ్య, మాజీ ఎన్‌సీసీ అధికారి కొల్లూరు ప్రకాశం, అంజిరెడ్డి, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, రంజిత్‌కుమార్, విజయకుమారి, వెంకటేష్, లలితాకుమారి, దేవేందర్ కౌర్ తదితరులు పాల్గొన్నారు.

కొండా దంపతుల రాకను విజయవంతం చేయండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రత్యూష -మనోజ్‌రెడ్డి

శ్రీపతిపల్లి మాజీ సర్పంచ్ కేశిరెడ్డి ప్రత్యూష -మనోజ్‌రెడ్డి

చిలుపూర్, ఆగస్టు 24: మండలంలోని శ్రీపతిపల్లి విష్ణు దుర్గామాత ఆలయంలో ఆదివారం నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలకు రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖతో పాటు, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు హాజరవుతున్నందున వారి పర్యటనను విజయవంతం చేయాలని మాజీ సర్పంచ్, ఆలయ కమిటీ ఛైర్మన్ కేశిరెడ్డి ప్రత్యూష -మనోజ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ, నాలుగేళ్ల క్రితం జరిగిన ఆలయ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా కొండా దంపతులు తమ గ్రామానికి వచ్చారని, అప్పటి మొక్కు ప్రకారం (రూ 8 లక్షల విలువ గల బంగారు హారం, చెవికమ్మలు, పుస్తెలు) అమ్మవారికి సమర్పించడం కోసం ఆదివారం వారు గ్రామానికి వస్తున్నారని అన్నారు. ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమానికి గ్రామస్థులంతా, రాజకీయ పార్టీలకతీతంగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రంగు హరీష్, గొంగిడి కృష్ణమూర్తి, ఉడుత వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీజేఐటీలో ప్రపంచ వ్యాపార వ్యవస్థాపకుల దినోత్సవం

జనగామ కల్చరల్, ఆగస్టు 24: యశ్వంతాపురం క్రీస్తుజ్యోతి (సీజేఐటీ) ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం 'ప్రపంచ వ్యాపార వ్యవస్థాపకుల దినోత్సవం' ఘనంగా నిర్వహించారు. ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సతీష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వ్యాపార వ్యవస్థాపకులకు గల అవకాశాలను, ప్రభుత్వం ద్వారా నూతనంగా వ్యాపార ప్రారంభానికి గల పథకాలను తెలియజేశారు. ప్రభుత్వం చేయూత అందిస్తున్నందున మన ఆలోచనలకు పదును పెట్టాలన్నారు. తద్వారా అనేక మందికి ఉపాధి అవకాశాలను కల్పించాలని విద్యార్థులకు సూచించారు. తమలోగల వ్యాపార ఆలోచనలను ప్రదర్శించిన విద్యార్థుల ప్రతిభను ప్రశంసిస్తూ గెలుపొందిన వారికి కళాశాల డైరెక్టర్ విజయపాల్‌రెడ్డితో కలిసి సతీష్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, ఐఐసీ కోఆర్డినేటర్ కె.యాకూబ్, అనిత, బి.వీరు, ఉదయ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న సతీష్

డెంగీ పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

● ఏడీపీహెచ్‌వో డాక్టర్ మల్లికార్జున్

జనగామ రూరల్, ఆగస్టు 24: డెంగీ, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏడీపీహెచ్‌వో డాక్టర్ మల్లికార్జున్ ఆరోగ్య కార్యకర్తలకు సూచించారు. డెంగ్యూ కేసుల క్షేత్ర పరిశీలనలో భాగంగా జిల్లా కేంద్రంలోని సంజయనగర్‌లో 7వ తరగతి చదువుతున్న చిన్నారి అమీన్ కుటుంబాన్ని శనివారం సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. మందులు సరిగా వాడాలని, సరైన భోజనం, పండ్లు, కూరగాయలతో పాటు చిన్నారికి ఇష్టమైన ఆహారం ఇచ్చినట్లయితే పాప తొందరగా కోలుకుంటుందని అన్నారు. ఏరోజుకారోజు కేసుల వివరాలను తనకు తెలియజేయాలని ఆరోగ్య కార్యకర్తలను కోరారు. డెంగీ బాధితులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకొని పూర్తి కోర్సు మందులు తీసుకోవాలన్నారు. పరిశీలనలో ప్రభాకర్, వి.రమేశ్, డాక్టర్ శ్రీతేజ తదితరులు పాల్గొన్నారు.

బోనాల జాతర ఉత్సవ కమిటీ చైర్మన్‌గా చిట్ల ఉపేందర్‌రెడ్డి



లింగాలఘణపురం, ఆగస్టు24: మండలంలోని నెల్లుట్ల గ్రామ బోనాల జాతర ఉత్సవ కమిటీ చైర్మన్‌గా జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ చిట్ల ఉపేందర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం గ్రామంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో గ్రామస్థులంతా ఏకమై బోనాల జాతర ఉత్సవాలకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్‌గా ఎన్నికైన ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ శ్రావణమాస బోనాల జాతరకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహిస్తామని హిందూ ఆచార సంప్రదాయాలకు పెద్దపీట వేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

'న్యాస్ పరీక్షకు సన్నద్ధం కావాలి'

జనగామ కల్చరల్, ఆగస్టు 24: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంపొందించే లక్ష్యంతో నిర్వహించే న్యాస్ పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని డీఈవో కె.రాము శనివారం ఒక ప్రకటనలో కోరారు. జాతీయ స్థాయిలో 3వ, 6వ, 9వ తరగతి చదువుతున్న విద్యార్థుల ప్రగతిని మదింపు చేయడానికి న్యాస్-2024ను నవంబరు 19న నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబరు 10, సెప్టెంబరు 30, నవంబరు 11న అన్ని పాఠశాలల్లో మాక్ టెస్టు నిర్వహించాలన్నారు. జిల్లా లోని అన్ని పాఠశాలల్లో ప్రతీ రోజు చివరి గంట న్యాస్ పరీక్షకు సంబంధించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. విద్యార్థులకు రోజువారి పరీక్షలు జరిపి వారికి ప్రశ్నాపత్రంపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ప్రతి విద్యార్థి పై శ్రద్ధ పెట్టి న్యాస్‌లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు.

ప్రారంభమైన తీజ్ ఉత్సవాలు

జనగామ కల్చరల్, ఆగస్టు 24: బంజారాల ప్రముఖ పర్వదినమైన తీజ్ ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. శనివారం బంజారాల ఆరాధ్య దైవమైన సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ మేరా మా యాడి యొక్క పూజలు నిర్వహించారు. ఈ పర్వదినాన్ని సెప్టెంబరు 1 వరకు తొమ్మిది రోజుల పాటు ఆట పాటలతో ప్రకృతిని ఆరాధిస్తూ వేడుకలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఐక్య వేదిక ప్రతినిధులు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా తీజ్ పండుగను రాష్ట్రమంతా ఒకేసారి శ్రావణ/ఆషాడ మాసంలో జరుపుకుంటున్నామన్నారు. 24న తీజ్ పండుగ ప్రారంభం కాగా 25న బోరడి తీజ్, 26, 27, 28, 29 తేదీలలో ఆటపాటలతో వేడుకలు నిర్వహిస్తామని, 30న డమోళి తీజ్, 31న గణగోర్ తీజ్, సెప్టెంబర్ 1న కడావ్ తీజ్‌తో వేడుకలు ముగుస్తాయని అన్నారు.

కొడకండ్లలో పోలీసుల కళాజాత

కొడకండ్ల ఆగస్టు 24: యువత దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలని ఏఎస్ఐ రమేశ్ సూచించారు. కొడకండ్ల ఎస్సీ కాలనీలో శనివారం రాత్రి పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత గంజాయి, గుట్కా తదితర మత్తు పానీయలకు దూరంగా ఉండాలని, డెబిట్ కార్డుల పిన్ నెంబర్లను ఎవరికి చెప్పవద్దనీ, ఫోన్‌లలో లాటరీలు వచ్చాయని మెసేజ్‌లు వస్తే మోస పోవద్దనీ, మంత్రాలు, తంత్రాలను నమ్మవద్దని అన్నారు. లోన్ యాప్‌ల బారిన పడవద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో నాగమణి, విలియమ్స్, వెంకటేశ్వర్లు, నారాయణ, రత్నయ్య, విక్రం రాజ్, శ్రీనివాస్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన కడియం

చిలుపూర్, ఆగస్టు 24 : మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి శనివారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. 79 మందికి రూ.79,09,164ల విలువ గల కల్యాణ లక్ష్మి, రూ5.40 లక్షల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ అందించేందుకు తాను కృషి చేస్తానన్నారు. రుణమాఫీ సమస్యలపై త్వరలోనే జిల్లా కలెక్టర్ సమక్షంలో బ్యాంకర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, ఎంపీవో శ్రీపాద మధుసూదన్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గడ్డమీది సురేశ్, కోల రమేష్, పోలేపల్లి రంజిత్‌రెడ్డి, బొమ్మిశెట్టి బాలరాజు, ఏదునూరి రవిందర్, తాళ్ళపల్లి సమ్మయ్య, సోశల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జి రంగు రమేష్, ఎడవెల్లి మల్లారెడ్డి, ఎమ్డీ షకీల్, తాళ్ళపల్లి సంపత్‌కుమార్, పసుల వెంకటేశ్, పొన్నం శ్రీను, పీఏసీఎస్ డైరెక్టర్ ఉమ్లానాయక్, రూప్లానాయక్, మారపాక ఇస్సాక్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

'పనుల్లో నాణ్యత పాటించాలి'


రఘునాథపల్లి, ఆగస్టు 24: అంగన్‌వాడి కేంద్రాల పునర్నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలని అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ ఆదేశించారు. శనివారం ఆయన ఆశ్వరావుపల్లి, ఫతేషాపూర్ అంగన్‌వాడి కేంద్రాలను సందర్శించి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రాల పునర్నిర్మాణంలో వంట గది, గోడలపై బొమ్మల పెయింటింగ్, ప్రహరీ, తాగు నీరు, టాయిలెట్స్ తదితర పనులలో నాణ్యత పాటిస్తు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జయంతి, పీఆర్ ఏఈ శ్రీనివాస రావు, సీడీపీవో ఫ్లోరెన్స్, సూపర్‌వైజర్ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

చెరువులను సందర్శించిన డీఈ

చిలుపూర్, ఆగస్టు 24 : దేవాదుల డీఈ కిషన్ ప్రసాద్ శనివారం ఆయా గ్రామాల్లోని ఊర చెరువులను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెంకటాద్రిపేట, వడ్డెరగూడెం గ్రామాల రైతాంగానికి సాగునీరందించేందుకు పైప్‌లైన్ అవసరమని, ఇందుకోసం ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాల మేరకు... మల్లన్నగండి రిజర్వాయర్‌కు వెళ్ళే దేవాదుల పైప్‌లైన్‌కు ఆనుకుని ఉన్న గేట్‌వాల్వ్ నుంచి నేరుగా వెంకటాద్రిపేట, వడ్డెరగూడెం కాలనీ సమీపంలోని చెరువుల్లోకి గోదావరి (దేవాదుల) జలాలను తరలించడం కోసం చర్యలు చేపడుతున్నామని, త్వరలోనే నివేదికను రూపొందించి ఉన్నతాధికారులకు నివేదిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చల్లా రాజ మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు దేవి తిరుపతి రెడ్డి, కేశిరెడ్డి చుక్కారెడ్డి, జంగం యాదగిరి, సమ్మయ్య, గోపు మధుసూధన్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, రాజిరెడ్డి, తుప్పరి ప్రవీన్, భిక్షపతి, శివరాత్రి శ్రీనివాస్, వెంకటేశ్, శివరాత్రి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డం సమ్మయ్య సేవలు మరువలేనివి

డీపీఆర్‌వో కల్వల శ్రీనివాసరావు



గడ్డం సమ్మయ్య దంపతులను సన్మానిస్తున్న డీపీఆర్‌వో

జనగామ రూరల్, ఆగస్టు 24: పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్య సమాచార శాఖకు అందించిన సేవలు మరువలేనివని డీపీఆర్‌వో కల్వల శ్రీనివాసరావు అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో గడ్డం సమ్మయ్య దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రవాణా సౌకర్యాలు సరిగా లేని రోజుల్లో మారుమూల ప్రాంతాలలో తమ చిందు యక్షగానంతో ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేశారని గుర్తుచేశారు. గడ్డం సమ్మయ్య ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తారని అన్నారు. కార్యక్రమంలో సంపత్, రేణుక, లక్ష్మీనారాయణ, కొమురయ్య, నరేష్, దివ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

సాగరంలో వైద్య శిబిరం

జఫర్‌గఢ్, ఆగస్టు 24: సాగరం గ్రామంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కూనూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యాధికారి డాక్టర్ రాజమౌళి నేతృత్వంలో వైద్య సిబ్బంది ప్రజలకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సంక్రమించే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిశుభ్రత, కలుషిత నీరు, దోమల వ్యాప్తి వంటి తదితర వాటివల్ల మలేరియా, డెంగీ జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని, కాచి చల్లార్చిన వేడి నీటిని సేవించాలని, మురికినీరు నిలువ లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో హెల్త్ సూపర్‌వైజర్ చందర్, ఏఎన్‌ఎం శ్రీలత, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'బహిరంగ సభను జయప్రదం చేయాలి'

జనగామ రూరల్, ఆగస్టు 24: సీపీఎం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9న నిర్వహించే వీరతెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల శౌర్యయాత్ర, బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ పిలుపునిచ్చారు. శనివారం జనగామ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో యాత్ర, బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో జరిగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ఫలితంగా నైజాం దొరలు, భూస్వాముల నుంచి భూములను సమీకరించి పేద ప్రజలకు పంపిణీ చేశారని గుర్తు చేశారు. సెప్టెంబరు 9న జనగామలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బూడిద గోపి, బొట్ల శ్రీను, ఎం.డి.అజాహరుద్దీన్, పందిళ్ల కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.